క్లుప్తంగా

నిషేధిత భూములను గుర్తించాం

తహసీల్దార్ షేక్ ముంతాజ్

కడ్తాల్: నిషేధిత జాబితాలో ఉన్న భూములు, వాటి సర్వే నంబర్లు, అధికారికంగా 22- ఎ రిజిస్టార్ పీఓబీ (ప్రొహిబిటెడ్ ల్యాండ్ ఆఫ్ బుక్)లో గుర్తించామని తహసీల్దార్ షేక్ ముంతాజ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో లావుని, సీలింగ్ పట్టాలు, భూదాన్ భూములు, ఎండోమెంట్, వక్ఫ్, అటవీ భూములు ఉన్నాయని తెలిపారు. ఈ భూములకు సంబంధించి క్రయ విక్రయాలు నిషేధించబడ్డాయన్నారు. ఎవరైనా వాటిని విక్రయించినా, కొనుగోలు చేసినా, లేదా అగ్రిమెంట్ చేసినా చట్టరీత్యా నేరమని వెల్లడించారు. ఇలాంటి భూములు అసైన్‌మెంట్ పట్టాదారులు, వారి వారసులు మాత్రమే అనుభవించడానికి అర్హులన్నారు. రియల్టర్లు, దళారుల మాటలు నమ్మి, రైతులు ఎలాంటి అగ్రిమెంట్స్ చేయరాదని, చేసినా చట్టరీత్యా పీఓటీ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. తిరిగి ఆ భూములను ప్రభుత్వానికి చెందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం



చెక్కు అందజేస్తున్న నాయకులు

మాడ్గుల: సీఎంఆర్ఎఫ్ పేదలకు వరమని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు సూదిని శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మాడ్గుల మండలం ఇర్విన్ గ్రామానికి చెందిన నర్సమ్మకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రూ.50 వేలు మంజూరు అయ్యాయి. ఈ మేరకు బుధవారం ఆయన బాధితురాలికి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు యాదయ్య, దళపతి, శివ, శ్రీశైలం, రాజు, ముస్తాఫ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



బాధితుడికి చెక్కు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం వెల్జాల గ్రామానికి చెందిన మల్కేడి ఈశ్వరీబాయికి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో ముఖ్యమంత్రి సహాయనిధి పథకం కింద రూ.45,500లు మంజూరయ్యాయి. ఈ మేరకు బుధవారం వెల్జాల్‌లో బాధిత కుటుంబ సభ్యులకు ఆమనగల్లు మార్కెట్ కమిటీ డైరెక్టర్ చర్ల వెంకట్‌రెడ్డి సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ నర్సింహులు, నాయకులు అశోక్‌బాబు, ఎంఎ అజీజ్, ఆరిఫ్, కృష్ణయ్యగౌడ్, రాజు, సయ్యద్‌గౌస్, పవన్, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

బీమా పథకాన్ని వినియోగించుకోండి

ఆమనగల్లు: ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంక్ ఆమనగల్లు శాఖ మేనేజర్ తిరుపతి కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. సోషల్ సెక్యూరిటీ స్కీమ్స్‌లోని ప్రధానమంత్రి సురక్ష బీమా యోజనతో ప్రజలకు ఎంతో మేలు జరగనుందని తెలిపారు. ఈ పథకం కింద ఏటా రూ.20 చెల్లించి ఏడాదికి 2 లక్షల ప్రమాద బీమా పొందవచ్చని పేర్కొన్నారు. దీనికి 18 నుంచి 70 సంవత్సరాలు వారు అర్హులన్నారు. అలాగే ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజనకు శ్రీ ఏడాదికి రూ.436 చెల్లించి రూ.2 లక్షల జీవిత బీమా పొందవచ్చన్నారు. 18 నుంచి 50 ఏళ్ల లోపు వారు అర్హులని వివరించారు. ఆన్‌లైన్ ద్వారా జరిగే మోసాలు, తప్పుడు కాల్స్‌వచ్చిన వెంటనే 1930 నంబర్‌కు కాల్‌చేసి ఫిర్యాదు చేయాలని మేనేజర్ తిరుపతి సూచించారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి

మంచాల: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి, త్వరగా పూర్తి చేయాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కొంగర విష్ణు వర్ధన్ రెడ్డి అన్నారు. బుధవారం మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో ఇందిరమ్మ కమిటీ ఆధ్వర్యంలో లబ్ధిదారుల ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో మొదటి విడతలో లబ్ధిపొందిన వారు.. త్వరగా ఇంటిని నిర్మించి, దశల వారీగా బిల్లులు పొందాలని సూచించారు. అర్హులు ఎవరూ ఆందోళన చెందవద్దని, అందరికీ ప్రభుత్వం ఇళ్లు నిర్మించి ఇస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు బుట్టి కృష్ణ, లక్ష్మణ్, బుగ్గరాములు, నాయకులు సురేష్, ఐలయ్య, మల్లేశ్, శ్రీకాంత్, గణేశ్ దితరులు పాల్గొన్నారు.

రైతు చెంతకు మరిన్ని సేవలు

రంగారెడ్డి- నల్గొండ జిల్లాల సరిహద్దులోని మాల్ గ్రామం మరింత గుర్తింపు పొందనుంది. ఇప్పటికే ఆత్మనిర్భర్ అవార్డుతో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందగా.. కొత్తగా డీసీసీబీ బ్రాంచ్, పీఏసీఎస్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. దీంతో రైతుల చెంతకు మరిన్ని సేవలు రానున్నాయి.

- మాల్‌లో కొత్తగా డీసీసీబీ, పీఏసీఎస్ ఏర్పాటు
- వ్యాపార పరంగా విస్తరించనున్న గ్రామం
- ఇప్పటికే ఆత్మనిర్భర్‌తో జాతీయ స్థాయి గుర్తింపు
- సంఘం ఏర్పాటుతో ఆశావహులకు డైరెక్టర్ల పదవులు



మాల్ వ్యాపార కేంద్రం

యాచారం: మండలంలోని నాగార్జునసాగర్- హైదరాబాద్ రహదారిపై ఉన్న మాల్ గ్రామం రెండు జిల్లాల్లోనే పెద్ద వ్యాపార కేంద్రంగా గుర్తింపు లభించింది. ప్రతి మంగళవారం జరిగే పశువుల సంతకు వివిధ గ్రామాల నుంచి వేలాది మంది వస్తుంటారు. వారికి కావాల్సిన సామగ్రి, ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ పనిముట్లు, యంత్రాలు తదితర వాటిని కొనుగోలు చేస్తుంటారు. ఇలా రూ.కోట్లల్లో ఆర్థిక లావాదేవీలు జరుగుతుంటాయి. అనేక మంది జీవనోపాధి పొందుతున్నారు. ప్రతివారం జరిగే సంతతోనే ఏడాదికి రూ.80 లక్షలకు పైగా ఆదాయం సమకూరుతుంది. పంచాయతీకి ప్రత్యేక ఆర్థిక వనరు కేటగిరి కింద మాల్‌కు ఆత్మనిర్భర్ జాతీయ పంచాయతీ అవార్డు దక్కింది. రూ.కోటి నగదు పారితోషికం అందింది.

రూ.50 లక్షలతో భవనం

మాల్‌లో కొత్తగా డీసీసీబీ(జిల్లా సహకార కేంద్ర బ్యాంకు) బ్రాంచ్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. డీసీసీబీకి ఉన్న స్థలంలో రూ.50 లక్షలకు పైగా నిధులు వెచ్చించి, శాశ్వత భవనాన్ని నిర్మించనున్నారు. ఈ శాఖతో రైతులకు మరిన్ని ఆర్థిక సేవలు అందనున్నాయని అధికారులు అభిప్రాయ పడుతున్నారు. ఈ బ్యాంకులో యాచారం మండలంతో పాటు మాడ్గుల, నల్గొండ జిల్లా చింతపల్లి, మర్రిగూడ తదితర మండలాల రైతులు ఖాతాలు తీసుకొని లావాదేవీలు జరపవచ్చు. భవన నిర్మాణ పనులు పూర్తి కావస్తున్నాయి. వారం, పది రోజుల్లో బ్యాంకు సేవలను అందించడానికి అధికారులు కృషి చేస్తున్నారు.

తీరనున్న నిరుద్యోగ సమస్య

మాల్‌లో కొత్తగా పీఏసీఎస్(ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం)ను ఏర్పాటు చేయడానికి సంబంధిత అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. మండల పరిధి 24 గ్రామాల్లో ఒకే పీఏసీఎస్ ఉంది. 13 మంది డైరెక్టర్లు, పది మందికి పైగా సిబ్బంది ఉన్నారు. సుమారు 9 వేల వరకు సభ్యులు ఉన్నారు. రూ.50 కోట్లకు పైగా ఆర్థిక లావాదేవీలతో కొనసాగుతుంది. కొత్తగా ఏర్పాటు అయ్యే సంఘం కింద మంతన్‌గౌరెల్లి, మాల్, నల్లవెల్లి, కిషన్‌పల్లి, కొత్తపల్లి, తక్కళ్లపల్లి, కేసీతండా తదితర గ్రామాలను తీసుకోనున్నారు. వీటి కింద 3,500 మంది రైతులు ఉంటారు. ఎన్నికలు జరిగితే కొత్తగా 13 మంది డైరెక్టర్లు, ప్రత్యేక చైర్మన్‌తో పాటు సీఈఓ, ఇతర సిబ్బంది కొలువుదీరుతారు. సంఘం ఏర్పాటుతో రాజకీయ ఆశావహులకు డైరెక్టర్ల పదవులతో నిరుద్యోగ సమస్య తీరనుంది. రానున్న సంఘం ఎన్నికలలోపే మాల్‌లో నూతన పాలకవర్గాన్ని ఏర్పాటు చేసే ఉద్దేశంతో అధికారులు ఉన్నారు.



మాల్‌లో కొత్తగా ఏర్పాటుకానున్న డీసీసీబీ బ్రాంచ్ శాశ్వత భవనం ఇదే

అన్ని సేవలు ఒకే చోట



మాల్‌లో డీసీసీబీ బ్రాంచ్‌ను ఏర్పాటు చేస్తే అన్ని సేవలు ఒకే చోట పొందే అవకాశం ఉంది. ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంకుల్లో రద్దీ దృష్ట్యా మేనేజర్లు ఖాతాదారులను పట్టించుకోరు. చిన్న రుణాల కోసం రోజుల తరబడి తిరగాల్సి వస్తుంది. పౌల్ట్రీ, డెయిరీఫాంల కోసం, వ్యవసాయం చేసుకోవడానికి రుణాలు పొందే అవకాశం ఉంటుంది.

– నేనావత్ శంకర్‌నాయక్, రైతు, కేసీతండా

సంఘం ఎన్నికలు నిర్వహించాలి



మాల్‌లో కొత్తగా పీఏసీఎస్ ఏర్పాటుతో రాజకీయాల్లో ఏళ్లుగా ప్రజాసేవ చేస్తున్న వారికి డైరెక్టర్లుగా అవకాశం లభించనుంది. ఈ గ్రామం చుట్టు పక్కల ప్రాంతాల రైతులకు ఆర్థిక పరమైన సేవలు సులభంగా అందనున్నాయి. మాల్ వ్యాపార కేంద్రం మరింత అభివృద్ధి చెందనుంది. ప్రభుత్వం వెంటనే పీఏసీఎస్‌లకు ఎన్నికలు నిర్వహించాలి.

– లక్ష్మీపతిగౌడ్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు, నల్లవెల్లి

రైతులకు మేలు



పది రోజుల వ్యవధిలోనే మాల్‌లో కొత్తగా డీసీసీబీ బ్రాంచ్‌ను ప్రారంభించనున్నాం. వచ్చే ఎన్నికలలోపు పీఏసీఎస్ కూడా ఏర్పాటు కాబోతుంది. డీసీసీబీ, పీఏసీఎస్‌ల ఏర్పాటుతో మాల్ చుట్టు పక్కల గ్రామాల రైతులకు ఎంతో మేలు జరగనుంది. వీటి ఏర్పాటు కోసం డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య ఎంతో పట్టుదలతో ఉన్నారు.

– నాగరాజు, సీఈఓ, పీఏసీఎస్, యాచారం

పీహెచ్‌సీని ఏర్పాటు చేయండి

- భవన నిర్మాణ పనులు ప్రారంభించాలి
- సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు

కడ్తాల్: మండల కేంద్రానికి మంజూరు అయిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణ పనులను వెంటనే చేపట్టాలని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ సంచాలకుల కార్యాలయంలోని అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 42 పీహెచ్‌సీల ఏర్పాటుకు రూ.66 కోట్లు మంజూరు అయ్యాయని తెలిపారు. కడ్తాల్ పీహెచ్‌సీకి నాటి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ రూ.1.43 కోట్లు కేటాయించారని పేర్కొన్నారు. నాడు అసెంబ్లీ ఎన్నికల కోడ్‌తో నిర్మాణ పనులకు ఆటంకం కలిగిందని తెలిపారు. కానీ ఇప్పటి వరకు పీహెచ్‌సీ ఏర్పాటుకు నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకోవడం లేదని ఆరోపించారు. స్థానికంగా ఆరోగ్య కేంద్రం లేకపోవడంతో మండల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. లేని పక్షంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ వీరయ్య, మాజీ ఎంపీటీసీ గోపాల్, నాయకులు ముత్యాలు, యాదయ్యగౌడ్, బాలకృష్ణ, పర్వతాలు, వంశీ తదితరులు ఉన్నారు.



అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆలయ నిర్మాణానికి ట్రస్టు సాయం

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం లింగసానిపల్లి గ్రామంలో నిర్మిస్తున్న హనుమాన్ ఆలయ నిర్మాణానికి ఉప్పల చారిటబుల్ ట్రస్టు నిర్మాణ సామగ్రి వితరణ చేసింది. ఆలయ నిర్మాణానికి సహకరించాలని ఆలయ కమిటీ సభ్యులు.. ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్‌ను కోరారు. ఈ మేరకు బుధవారం సిమెంట్ బస్తాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు రాములు, కిరణ్, శేఖర్‌రెడ్డి, పరశురాములు, భీమయ్య, సత్యం, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ రోడ్లకు మహర్దశ



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

- అభివృద్ధికి రూ.25 కోట్లు మంజూరు
- కాంగ్రెస్ నాయకులు

అబ్దుల్లాపూర్‌మెట్: ఇబ్రహీంపట్నం నియోజకవర్గ రోడ్లకు మహర్దశ పట్టనుందని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. అందుకు రూ.25 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. పెద్దఅంబర్‌పేటలో బుధవారం పార్టీ పట్టణ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కరచారి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కృష్ణారెడ్డిలు మాట్లాడారు. రోడ్ల అభివృద్ధికి రూ.383 కోట్లు మంజూరు చేయాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, రోడ్ల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డిలు రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారని తెలిపారు. ఈ మేరకు 5 రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేశారని పేర్కొన్నారు. పెద్దఅంబర్‌పేట నుంచి తొర్రూర్ వయా మునగనూర్ రోడ్డుకు రూ.5 కోట్లు, పెద్దఅంబర్‌పేట ఓల్డ్ నేషనల్ హైవే విస్తరణకు రూ.3 కోట్లు, పెద్దఅంబర్‌పేట నుంచి కవాడిపల్లి వయా బలిజగూడ రోడ్డు విస్తరణ, మరమ్మతుల కోసం రూ.5 కోట్లు, ఇబ్రహీంపట్నం- దండుమైలారం డబుల్ రోడ్డులో సీసీరోడ్డు నిర్మాణానికి రూ.2 కోట్లు, హయత్‌నగర్ సాయిబాబా టెంపుల్ నుంచి తొర్రూర్ రోడ్డు జీ స్కూల్ వరకు 4 లైన్ల రోడ్డు విస్తరణకు రూ.10 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా మల్‌రెడ్డి సోదరులతో పాటు ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు విజయేందర్‌రెడ్డి, రాజేందర్ ముదిరాజ్, శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సత్యనారాయణరెడ్డి, సురేష్, నాగార్జున, జగన్, మహేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.


అగ్ని ప్రమాదాలపై అప్రమత్తత అవసరం

ఇబ్రహీంపట్నం: అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఇబ్రహీంపట్నం అగ్ని మాపక (ఫైర్ స్టేషన్) ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ అన్నారు. అగ్ని ప్రమాదాల నుంచి ఎలా బయటపడాలనే అంశంపై బుధవారం ఇబ్రహీంపట్నం ఈషా ఆస్పత్రిలో మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనవాసాలు ఎక్కువగా ఉండే అపార్ట్‌మెంట్స్, షాపింగ్ మాల్స్, ఆస్పత్రులు, సినిమా హాళ్లలో ఫైర్‌సేఫ్టీ కచ్చితంగా పాటించాలని సూచించారు. ఇంట్లో గ్యాస్ సిలిండర్ పెట్టిన చోట కిటికీలు ఉండేలా చూసుకోవాలని చెప్పారు. ప్రమాదాలు జరిగితే వెంటనే అగ్ని మాపక సిబ్బందికి సమాచారం ఇవ్వాలని కోరారు. అనంతరం ఆస్పత్రుల్లో అగ్ని ప్రమాదం జరిగినప్పుడు రోగులను ఎలా సురక్షితంగా బయటకు తీసుకురావాలి, మంటలను అదుపులో పెట్టేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో మాక్‌డ్రిల్ ద్వారా అవగాహన కల్పించారు.



అవగాహన కల్పిస్తున్న ఫైర్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ

పల్లెల్లో సందడి



- ఎన్నికల నోటిఫికేషన్‌పై ప్రభుత్వ సంకేతాలు
- పంచాయతీ పోరుకు సన్నాహాలు
- ఆశావహుల ఉరుకులు పరుగులు
- ప్రజా కార్యక్రమాల్లో హడావుడి

మంచాల: పల్లెల్లో 'స్థానిక సంస్థల ఎన్నికల' సందడి మొదలైంది. ఇదిగో అదిగో అంటూ ప్రభుత్వం సంకేతాలు ఇస్తుండగా.. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉండాలని అధికార యంత్రాంగం సిబ్బందిని పురమాయిస్తోంది. పార్టీల గుర్తుతో ఎన్నికలకు సంబంధం లేకపోయినప్పటికీ.. అన్ని పార్టీలు సవాల్‌కు తీసుకొంటున్నాయి. తమ శ్రేణులను సన్నద్ధం చేస్తున్నాయి. ఆశావహులు తమ అనుచరులతో ఎన్నికలపై తరచూ చర్చిస్తున్నారు. గ్రామాల్లో తమ ఉనికిని చాటుకునేందుకు ప్రజాసేవలో తరిస్తున్నారు. ఎవరికి ఏ అవసరమొచ్చినా నేనున్నానంటూ హామీ ఇస్తున్నారు.

23 పంచాయతీలు, 12 ఎంపీటీసీలు

యాచారం మండలంలో 23 గ్రామ పంచాయతీలు, 12 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. 40 వేల 848 ఓటర్లు ఉన్నారు. వారిలో 20,725 మంది పురుషులు, 20,122 మంది మహిళలు ఉన్నారు. 23 జీపీల్లో మేజరుగా ఆరుట్ల, మంచాల, లోయపల్లి గ్రామాలు ఉన్నాయి. ఆరుట్లలో 6,648 ఓటర్లు ఉండగా.. వారిలో 3,424 పురుషులు, 3,224 మంది స్త్రీలు ఉన్నారు. మంచాలలో 3,922 ఓటర్లు ఉండగా వారిలో 1953 మంది పురుషులు, 1969 మంది స్త్రీలు ఉన్నారు. లోయపల్లిలో 3,859 ఓటర్లు ఉండగా అందులో 2,023 మంది పురుషులు, 1,836 మంది మహిళలు ఉన్నారు. మండలంలో అత్యధికంగా ఓట్లు ఉన్న గ్రామం ఆరుట్ల కాగా.. అత్యల్పంగా సత్తితండా. ఇక్కడ 541 మంది ఓటర్లలో 300 పురుషులు, 241 మంది స్త్రీలు ఉన్నారు.

ప్రభుత్వంపై వ్యతిరేకత..

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతనే బీఆర్ఎస్ పార్టీకి కలిసొచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే సంక్షేమ పథకాలు సక్రమంగా అందడం లేదని, అర్హులకు పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు తదితర పథకాలు అందడం లేదనే విమర్శలను అధికార పార్టీ మూటగట్టుకుంది. దానికి తోడు మండలంలోని కాంగ్రెస్ శ్రేణుల్లో కొత్త, పాత అనే విభేదాలు నెలకొన్నాయి. అధిష్టానం దృష్టి సారించి, రెండు వర్గాల మధ్య సమన్వయం చేపట్టని నేపథ్యంలో అంతిమంగా హస్తానికి నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది.

విస్తృత సమీక్షలు

స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని అన్ని రాజకీయ పార్టీలు.. పార్టీ శ్రేణులతో విస్తృత సమావేశాలు నిర్వహిస్తున్నాయి. బీఆర్ఎస్ పార్టీ.. గతంలో గెలిచిన గ్రామాల్లో తిరిగి పాగా వేయడానికి ప్రయత్నాలు చేస్తోంది. సీపీఎం గతంలో ప్రజా ప్రతినిధులుగా పనిచేసిన గ్రామాల్లో బలం పుంజుకోవడానికి విశ్వ ప్రయత్నాలు చేస్తోంది. బీజేపీ ప్రభావం మండలంలోని నాలుగైదు గ్రామాలకు పరిమితం అయింది. ఏదీ ఏమైనా స్థానిక ఎన్నికల్లో నేపథ్యంలో మండలంలో రాజకీయ వేడి రాజుకుంటోంది. రసవత్తరంగా మారే అవకాశం ఉంది.

ఆశావహుల ఆతృత

స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఆశావహులు ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం ఎప్పుడెప్పుడు నోటిఫికేషన్ విడుదల చేస్తుందా అని ఆతృతగా ఉన్నారు. పంచాయతీల పాలన ముగిసి ఏడాదిన్నర గడిచినప్పటికీ.. నాటి నుంచి గ్రామాల్లో పోటీదారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ అనేక కార్యక్రమాలు చేపడుతున్నారు. ప్రజలకు చేరువ కావడానికి శుభ, అశుభ కార్యక్రమాల్లో పాల్గొంటూ హడావుడి చేస్తున్నారు. అధికంగా డబ్బులు ఖర్చుపెడుతున్నారు. ఎంత తొందరగా ఎన్నికలు నిర్వహిస్తే.. అంతే వేగంతో రాజకీయ భవిష్యత్‌ను తేల్చుకోవడానికి సిద్ధంగా ఉన్నారు.

జాతీయ పార్టీల ప్రభావం



ఆరుట్ల మేజరు గ్రామ పంచాయతీ కావడంతో రాజకీయంగా అధిక ప్రభావం చూపే అవకాశం ఉంది. ఇక్కడ 6,648 ఓట్లు ఉన్నాయి. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీతో పాటు సీపీఎం కూడా పోటీలో ఉంది. అయినప్పటికీ కాంగ్రెస్ ప్రభావం అధికంగా కనిపిస్తుంది. అదే స్థాయిలో ఆ పార్టీలో అంతర్గత విభేదాలు, ఇతర పార్టీలకు ప్రయోజనం చేకూర్చే అవకాశం లేక పోలేదు. లోయపల్లిలోనూ హస్తందే బలం. మంచాలలో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య పోటీ ఉంది. ప్రస్తుత పరిస్థితిలో హస్తం పార్టీ రాజకీయంగా కలిసొచ్చే అవకాశం ఉంది. రాష్ట్రంలో అధికారంలో ఉండడమే కాకుండా.. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యేగా మల్‌రెడ్డి రంగారెడ్డి ఉండటం మరింత బలం పెరిగింది. గ్రామాల్లో రాజకీయ ఆశావహులు ఇప్పటికే కొందరు కారును వీడి.. హస్తం గూటికి చేరారు.

కబ్జాలో ఉన్నా.. పరిహారం ఇప్పించండి

రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డికి రైతు అంజయ్య విన్నపం



కోదండరెడ్డికి తన సమస్యను వివరిస్తున్న రైతు

యాచారం: 'బాంచన్.. నీ కాల్మొక్తా.. కబ్జాలో ఉన్న పొలానికి పరిహారం ఇప్పించండి సారూ' అని రైతు అంజయ్య.. రైతు కమిషన్ చైర్మన్ ముదిరెడ్డి కోదండరెడ్డిని వేడుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. కుర్మిద్ద గ్రామానికి చెందిన రైతు గోపలి అంజయ్య పరిహారం విషయమై బుధవారం యాచారం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చాడు. అదే సమయంలో చైర్మన్ కోదండరెడ్డి అక్కడి వచ్చారు. ఇది గమనించిన రైతు.. చైర్మన్ కాళ్లమీద పడ్డాడు. 'సర్వే నంబరు 39లో ఎకరంన్నర భూమిలో ఉన్న గుట్టలు, రాళ్లు, రప్పలను రూ.లక్షలు ఖర్చు చేసి తొలగించి, సాగుకు యోగ్యంగా మార్చుకున్నాను. 25 ఏళ్లుగా కబ్జాలో ఉండి, సాగు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నాను. కానీ టీజీఐఐసీ అధికారులు పొలాన్ని తీసుకుంటామంటున్నారు. కానీ పరిహారం ఇవ్వడం లేదు. కబ్జాలో లేని వారికి ఇచ్చారు. తనకు అన్యాయం చేశారు' అని వాపోయాడు. ఇదే విషయమై పలుమార్లు కలెక్టర్, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని, ప్రస్తుత ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిశానని పేర్కొన్నాడు. అవార్డు లిస్టులో తన పేరుందని, కానీ పరిహారం ఇవ్వడం లేదని పేర్కొన్నారు. దీనికి స్పందించిన ముదిరెడ్డి.. వెంటనే ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్ రెడ్డికి ఫోన్ చేశారు. అంజయ్య కబ్జాలో ఉన్నాడో.. లేదో గుర్తించి, అర్హత ఉంటే వెంటనే పరిహారం అందజేయాలని సూచించారు.

అతివల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



మహిళలకు కుట్టు మిషన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

హయత్‌నగర్: మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని ఇబ్రహింపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. బుధవారం తుర్కయంజాల్ మున్సిపాలిటీ తొర్రూర్‌లో రాష్ట్ర మైనార్టీ కమిషన్ ఆధ్వర్యంలో మైనార్టీ మహిళలకు కుట్టుమిషన్లను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. స్త్రీలు ఆర్థికంగా ఎదిగితేనే కుటుంబం బాగుంటుందని తెలిపారు. రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే ధ్యేయంతో పలు పథకాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్లతో సహా ప్రభుత్వ పథకాలను ఆడవారి పేరుమీదనే ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, మున్సిపల్ కమిషనర్ అమరేందర్‌రెడ్డి, ముస్లిం మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబెదుల్లా కొత్వాల్, నాయకులు కొత్తకుర్మ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు

ఎస్ఈ డీఎస్ మోహన్

కడ్తాల్: విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని రాజేందర్‌నగర్ ఎస్ఈ డీఎస్ మోహన్ అన్నారు. బుధవారం మండల పరిధి మక్తమాధారంలో ఆయన పర్యటించారు. గ్రామానికి నూతనంగా మంజూరైన 33/11 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటు ప్రదేశాన్ని ఆయన పరిశీలించారు. ప్రాంత రైతులు, వినియోగదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 33 కేవీ ఇంటర్ లింకింగ్ లైన్ మాధారం నుంచి కడ్తాల్ వరకు వెంటనే పనులను ప్రారంభించాలని కాంట్రాక్టర్‌ను ఎస్ఈ ఆదేశించారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్ పర్సన్ యాటగీత, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, ఏడీఈ బాలకృష్ణరావు, ఏఈలు నరేందర్, విజయ్, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు బాలరాజు, కాంట్రాక్టర్ కృష్ణయ్య, చెన్నయ్య, భిక్షపతి, సురేశ్, నర్సింహ, శ్రీరాములు నారాయణ, చంద్రయ్య, కృష్ణ, సాయిలు, యాదగిరి, షాబుద్దీన్ తదితరులు ఉన్నారు.



సబ్‌స్టేషన్ ఏర్పాటు స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఈ మోహన్ తదితరులు

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

అబ్దుల్లాపూర్‌మెట్: అబ్దుల్లాపూర్‌మెట్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని 33/11కేవీ మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నామని ఏఈ నరేందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అబ్దుల్లాపూర్‌మెట్ టౌన్, జెఎన్ఎన్‌యుఆర్ఎం కాలనీ, పలు పరిశ్రమలకు అంతరాయం కలగనుందని పేర్కొన్నారు. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.